# సుబ్బలక్ష్మి సఖుడి కథ




పాలకోడేటి సత్యనారాయణ

'లక్ష్మీ...'

తలెత్తి చూసింది సుబ్బలక్ష్మి. రోడ్డుకు అటుపక్కనున్న పేవ్‌మెంట్‌మీద నిలబడి ఉన్నాడు శేఖరం.

'హలో!'

పిలుపులో మార్దవం ఉంది, ప్రేరణ ఉంది, ఆజ్ఞ ఉంది.

మౌనంగా రోడ్డును క్రాస్‌చేసి, అతన్ని చేరింది సుబ్బలక్ష్మి.

సుబ్బలక్ష్మికేసి ఒకసారిచూసి అన్నాడు శేఖరం 'క్లాసు ఎన్ని గంటలకు?'

'పదింటికి—'

శేఖరం వాచీ చూసుకొన్నాడు—తొమ్మిది ముప్పయి అయిదు.

'ఏం క్లాసు?'

'బోటనీ—'

'వెళ్లాలా?'

'వెళ్ళాలి మరి—' అంది సుబ్బలక్ష్మి నవ్వుతూ.

'వెళ్ళద్దు, నాతోరా—' అన్నాడు శేఖరం నవ్వుతూ.

'బావా, క్లాసుంది—' ప్రాధేయపూర్వకంగ అడిగింది సుబ్బలక్ష్మి.

'నథింగ్ డూయింగ్, కమాన్—' అన్నాడు శేఖరం నడుస్తూ. మరింకేం అనకుండా అతన్ని అనుసరించింది సుబ్బలక్ష్మి.

సుబ్బలక్ష్మి—అవును, ఆ అమ్మాయే సుబ్బలక్ష్మి. ఖచ్చితంగ పదిహేడేళ్ళు. బి. ఎస్‌సి. మొదటి సంవత్సరం చదువుతున్న ఆ అందంగ ఉంటే ఉండని ఉండని ఆ అమ్మాయి, ఎం.ఎస్‌సి. ఫైనల్ చదువుతున్న శేఖరాన్ని అనుసరించింది. ఇద్దరూ పక్కపక్కనే మౌనంగ నడువ సాగారు.

వై. ఎం. సి. ఎ. దగ్గర బయలుదేరిన వీళ్ళు దీపక్‌మహల్ దాటారు. చౌరస్తా రాగానే అంది సుబ్బలక్ష్మి 'ఎక్కడికి బావా?'

పక్కకు తిరిగి సుబ్బలక్ష్మికేసి చూశాడు శేఖరం.

నవ్వింది సుబ్బలక్ష్మి—'సరే, పద.'

తాజ్‌మహల్ హోటల్లోకి వచ్చారు. కారిడార్‌లోకి రాగానే అంది సుబ్బలక్ష్మి—'నేను భోంచేసి వచ్చాను. నేనేం తినను.'

'కానీ, నేను భోజనం చేయలేదు మరి—'

'పద—'

ఇద్దరూ ఫ్యామిలీ రూంలో రెండు కుర్చీలు ఆక్రమించారు. తన టిఫిన్ డబ్బాను తీసి, శేఖరం ముందుకు తోసింది సుబ్బలక్ష్మి.

మూత తీస్తూ అడిగాడు 'ఏమిటది?'

సుబ్బలక్ష్మి జవాబుకన్నా ముందుగ మూతే ఊడింది—ఉప్మా!

వెయిటర్ వచ్చాడు మంచినీళ్ల గ్లాసు

'అలా— 'గులాబ్‌జాం—'
'రెండు ప్లేటులా సార్?'
'ఒకటే'—సుబ్బలక్ష్మి అంది. శేఖర్ తలెత్తి చూశాడు. వెయిటర్ వెళ్ళిపోయాడు. చెంచా తీసుకుని మెల్లిగ ఉప్మా తినడం ప్రారంభించాడు. కొంత తిన్నాక అన్నాడు శేఖరం—'అవ్వట్నుంచి మధ్యాహ్నం ఏం చేస్తావు నువ్వు?'
'అంటే?'
'నీ టిఫిన్ నేను తినేస్తే...'
'ఇప్పుడు జ్ఞాపకం వచ్చిందా? తిను, పర్వాలేదు, ఏదో చేస్తాను—'
శేఖరం తింటూనే ఉన్నాడు.
వెయిటర్ వచ్చాడు—ఒక ప్లేటు, రెండు గులాబ్ జాంలతో. ఇద్దరికీ మధ్యన ఉంచి, వెళ్ళిపోయాడు. శేఖరం ఆ ప్లేటును సుబ్బలక్ష్మి ముందుకు తోశాడు—'ఊఁ, కానియ్—'
'నావల్ల కాదు—'
'పంచుకుందామా?' అంటూనే శేఖర్ ఒకటితీసి నోట్లో వేసుకున్నాడు.
రెండోది తీసుకుంటూ అంది సుబ్బలక్ష్మి—'ఏమిటి సంగతి? మామూలేగా?'
శేఖర్ తలెత్తి చూశాడొకసారి సుబ్బలక్ష్మి కేసి.
చివరిసారిగ టిఫిన్‌డబ్బాలోంచి చెంచాతో ఉప్మా తీసుకుంటూ అన్నాడు—'లక్ష్మీ, పెళ్ళి చేసుకుంటావా?'
'కాఫీ తాగుతావా?' అన్నంత తేలిగ్గ అడిగాడు శేఖరం.
'ఆ, తాగుతాను' అన్నంత తేలికగనే జవాబిచ్చింది సుబ్బలక్ష్మి—'ఆ, చేసుకుంటాను.'
వెయిటర్ వచ్చాడు. ఈసారి సుబ్బలక్ష్మే అంది: 'రెండు కాఫీ—'
వెయిటర్ వెళ్ళిపోయాక అన్నాడు శేఖరం—'థాంక్‌యూ.'
'సరేగాని, మళ్ళీ ఏమొచ్చింది?'
'అనుమానం, అంతే!'
'ఎప్పుడూ ఉండేదేగా...అయినా బావా, ఆఖరుసారి చెబుతున్నాను—నేను నిన్ను చేసుకోవడానికి ఎంతసిద్ధంగ ఉన్నా, పదేపదే ఆమాట అనుకోవడం ఎందుకు చెప్పు? ఇది అప్పుడే మూడోసారి. ఇంకో సారి ఇలాగ క్లాసు ఎగ్గొట్టి, డబ్బు తగలేసి. ఇదే ప్రశ్నవేస్తే, 'చేసుకోనని' చెప్పేస్తా...'
వెయిటర్ కాఫీలు తెచ్చాడు. కలుపుతూ అన్నాడు శేఖరం—'వేడిగావుంది'
'నా ఏమాటలా?'
'కాఫీమాటాను—' నవ్వాడు శేఖరం.
కాఫీలు తాగడం పూర్తి చేశారు ఇద్దరూ. వెయిటర్ ప్లేటులో బిల్లు తెచ్చాడు. జేబులో డబ్బుకోసం చేయి పెడుతున్న శేఖరాన్ని వారించింది సుబ్బలక్ష్మి— 'నేను బిల్ పే చేస్తాన్లే—'
నవ్వుతూ అన్నాడు శేఖరం—'ఇదిగో, రెండోసారి చెబుతున్నాను. తినడం నావంతు, బిల్లు పే చేయడం నీవంటూనా? ఇంకోసారి ఇలాగే బిల్ పే చేస్తానంటే...'
'ఏం చేస్తావేం?'
'ఏం చేస్తానా?' క్షణం ఆగి అన్నాడు శేఖర్—'నీతో ఉన్నపుడు తినడం మానేసి, నీటిఫిన్ డబ్బాకు ఉపూరుమంటూ ఉపవాసం చేస్తా.'
'ఎందుకు బావా అంతకష్టం? ఈసారి నుంచి నువ్వే పే చేద్దువుగాన్లే—' అంటూనే ప్లేటులో అయిదు రూపాయల నోటును వదేసింది. వెయిటర్ వచ్చి ప్లేటును తీసుకెళ్ళాడు.
'బావా, ఒకటి అడుగుతా చెబుదూ—అత్తయ్య ఎంత పంపిస్తుంది నీకు?'
'ఏం?'
ఏంలేదు, ఊరికనే నే విన్నదానికి, జరిగే దానికీ చాల తేడా ఉందనిపిస్తే...'
శేఖరం నీరసంగ నవ్వుతూ అన్నాడు—'లక్ష్మీ, నిజంగనే చాల తేడా ఉంది. అమ్మ పంపేది వంద రూపాయలు—'
'మరి, సరిపోతాయా?'
'అలాటిప్రశ్న నువ్వు అడగకూడదు, నేను చెప్పకూడదు. అయినా, కావాల్సిన దానవు, అడిగావు కనుక చెబుతాను—హాస్టల్‌కు దాదాపుగ ఎనభై, ఎనభై అయిదు. పోనీ ఇంక పదిహేను. సరే, ఈ మిగిలినది ఎలాగా నెలకు సరిపోదు గనుకనే...'
'చెప్పు...'
'...సరిపోదు గనుకనే, ఛ—ఇంకోలా చెబుతాను. నా కొక మేనమామ కూతురుంది. తమకున్న డబ్బును వారసత్వపు హక్కుగ కూతురు తగలేస్తుంది. ఆ కూతురు నాకు అత్మబంధువు; అన్నదానవి' చెలామణీన ఇరవయ్యో, పాతికో అప్పుగ తీసుకుంటాం. అదీ కథ—'
'అలాగా, అయితే ఆ అమ్మాయి ఇక నీకు అప్పు ఇవ్వదు.'
'ఏం? ఒళ్ళు పొగరా?'
'ఛీ బావా, ఆ డబ్బును అప్పు అన్నావు ఎన్నిసార్లు చెప్పాను నీకు?'
'నేను రైట్ చెబుతున్నాను—నీదగ్గర తీసుకున్నదంతా, నీకు తిరిగి ఇచ్చేద్దామనే అనుకుంటున్నాను నేను నిన్ను పెళ్ళి చేసుకుంటే చాలుగా—'
'వెరీగుడ్—లేద్దామా ఇంక?'
సుబ్బలక్ష్మి లేవడంతో శేఖరం కూడా లేచాడు. ప్లేటులోంచి నోట్లు తీశాడు. సుబ్బలక్ష్మికి ఇవ్వబోతోంటే అంది: 'ఉంచు బావా!'
'ఏమిటి నెక్స్ట్?' అంది సుబ్బలక్ష్మి.
ఈ క్షణంలో సుబ్బలక్ష్మికి శేఖరం అంటే అపారమైన అభిమానం ఉంది. ఇన్నాళ్ళకి అతడు తనతో నిజం చెప్పాడు. అత్తయ్య పంపేదెంత అని తనెన్నోసార్లు అడిగింది. అతనే కావాలని చెప్పకుండా దాటవేస్తూ వచ్చాడు. ఒకటి రెండుసార్లు వచ్చి, పాతిక రూపాయలదాకా తీసుకెళ్ళాడు. ఆ డబ్బును మళ్ళీ తను అడగడం కానీ, బావ తిరిగి ఇవ్వడం కానీ జరగలేదు, జరగదు కూడాను.
దీపక్ మహల్‌లోకి వచ్చారు ఇద్దరూ.
ఈవేళ శేఖరం ఇంకేమి చెప్పినా వినాలనే అనుకుంది సుబ్బలక్ష్మి. అందుకే మొదట్లో 'క్లాసుంది' అన్న తనే, సినిమాకు వచ్చినా ఊరుకొంది. థియేటర్ ఖాళీగనే ఉండటంతో, ఎంతో పెద్దదిగ కనిపిస్తోంది. పావురాలు అటూ ఇటూ తిరుగుతున్నాయి హాలులో.
'లక్ష్మీ—'
సుబ్బలక్ష్మి ఆలోచనలకు అంతరాయం కలిగింది—'ఊఁ...'
'సినిమాకు అభ్యంతరం లేకపోయిందా?'
'ఎందుకో చూడాలనిపించింది. అందుకే వచ్చాను—'
'మంచిపని చేశావు నిజం చెబుతా లక్ష్మీ—నువ్విలా నాతోపాటు ఉంటే ఏదో ఉత్సాహం, అన్నీ నాకే ఉన్నాయని పిస్తుంది; ఎంతో హాయిగ, ఎంతో

ప్రశాంతిగ ఉంటుంది. ఎప్పుడు వస్తావు నా ఇంటికి?'

సుబ్బలక్ష్మి నవ్వింది.

'నవ్వుతావేం?'

'నవ్వక ఏం చేయమంటావు?'

ఈ జవాబుకు శేఖరానికి నవ్వు వచ్చింది—'నిజమే లక్ష్మీ — నీ కెలాగ చెప్పను? జీవితం అంతా నీలోనే ఉందని పిస్తుంది. నువ్వు లేకపోతే— ఏదో వెలితి...' పరావంగా ఉన్న సుబ్బలక్ష్మి చేతిని తన చేతిలోకి తీసుకొన్నాడు.

బావ వొక్కసారి ఒడిలోకి తీసుకొని లాలించా లనిపించింది సుబ్బలక్ష్మికి.

'...చెప్పు లక్ష్మీ—నా ఇంటికెవస్తావు గదూ?'

'బావా, ఎందుకు వస్తుంది నీకీ అనుమానం?'

'ఏమో—ఇది నా బలహీనతే, కావచ్చును. నిన్నిలా నా ప్రక్కనే ఉంచుకొని, నీ చేతిని నా చేతిలో ఉంచుకొని కూడా ఈ ప్రశ్న వేశానంటే......ఏమిటో— ఎందుకో తెలీదు, మనసంతా ఆందోళన—'

సుబ్బలక్ష్మికి ఎంతో హాయిగ ఉంది. మగవాడు తనకోసం పడి చస్తున్నాడంటే ఆ విషయం తెలిస్తే, ఆ ఆడదానికి ఎంతో ఆహ్లాదంగ ఉంటుంది మరి!

ఆత్రుత, ఆందోళన - అన్నీ అవతల వున్న మగవాడికి!

'నిజం లక్ష్మీ—నువ్వు నాదానివేగా?'

'ఆ, నిజంగ నీదాన్నే! చాలా?'

'ఈ ఒక్క పదంకోసం నే నెంతగా తపన పడిపోతున్నానో నీకేం తెలుసు? అప్పుడప్పుడు నాలో అనుమానం పొడచూపుతుంది. మళ్లీ నీ దగ్గరకు క్లారిఫికేషన్ కోసం రావడం. ఈ ఆందోళనతో చదువు చదవలేక పోతున్నానేమో కూడాను.'

'బాబోయ్, ఆ పని చేయకు. ఖర్మ కాలి పెళ్లయితే, ఇంకో ఏడాది...'

'ఫెయిలయితే ఫర్వాలేదుగానీ, ఇంకో ఏడాది నీకు దూరంగ గడపాలంటే నా వల్ల కాదు. అందుకైనా పాసవుతాను.'

సినిమా మొదలయ్యేసరికి, సుబ్బలక్ష్మి ఏదో అనబోయింది, కాని ఊరుకొంది. ఇంటర్వెల్‌లో సుబ్బలక్ష్మి బాగ్ అందుకొన్నాడు. అందులో అయిదు రూపాయల నోట్లు రెండు, చిల్లర వున్నాయి.

# సుబ్బలక్ష్మి...

'ఇదుగో, రేపో పొతిక...'

'సరేలే—కానీ యింటికి రా బావా! అక్కడే యిస్తా నీకు.'

'వద్దు లక్ష్మీ, నువు తీసుకురా!... రేపు కనిపించి వసూలు చేసుకుంటా నేను.'

'మర్చిపోను—'

సినిమా అయిపోయాక థియేటర్‌లోంచి బయటకు వస్తూ అన్నాడు శేఖరం— 'లక్ష్మీ మామయ్యతో ఎప్పుడు చెప్తావ్?'

'అది నీ పని—'

'అయితే సరే, ఈవేళే...'

సుబ్బలక్ష్మి కంగారుగ అంది: 'నో,నో నేను చెబుతాలే—సమయం చూసి—'

నిజమే, సమయం చూసుకొని మరీ చెప్పు. మూడ్ బాగలేకపోతే, ఏదో సినిమాలోలాగ 'ఆ దరిద్రుడికీ, నీకూ పెళ్లా, నోర్ముయ్' అన్నా అంటాడు.'

సుబ్బలక్ష్మి మనసెంతో కుంచించుకు పోయింది. బాధతో అంది—'బావా, నిజం చెప్పు—ఈ ఊహతోనే నువ్వు ఇంటికి రావటం మానేసావా?'

'అఫ్‌కోర్స్...'

'ఇదుగో అబ్బాయ్, సీరియస్‌గ చెబుతున్నాను. ఏవేవో సందేహాలతో మనసు చెడగొట్టుకోకు పేదా, గొప్పా — ఇవన్నీ ఒక ఇంట్లోనా? ఇంకెప్పుడూ అలా అనకూడదు, సరేనా?—'

'జో హుకుమ్—' అన్నాడు శేఖరం బుద్ధిమంతుడిలాగ.

'అంత బుద్ధిమంతుడి లాగనే ఇంటికిరా రేపు—'

'హోకే—' వీడ్కోలుచెబుతూ అన్నాడు శేఖరం.

సుబ్బలక్ష్మి వెళ్లిపోతూ, మలుపు తిరుగుతున్నప్పుడు ఒకసారి వెనక్కు తిరిగింది. అదే ప్రదేశంలో అలాగే నిలబడి ఉన్నాడు శేఖరం. మనసు మళ్లీ అతన్ని చేరమంది — సుబ్బలక్ష్మిమాత్రం కూడదంది.

* * *

మర్నాడు సాయంత్రమే శేఖరం సుబ్బలక్ష్మి ఇంటికివెళ్లాడు. తలుపు తట్టగా తట్టగా వచ్చి తలుపుతీసింది సుబ్బలక్ష్మి.

'ఏం చేస్తున్నావు ఇంట్లో?'

'వంటింట్లో ఉన్నాను బావా! విని పించలేదు. ఎంతసేపయింది వచ్చి? రా లోపలికి—' సుబ్బలక్ష్మి ప్రశ్నలకు జవాబేమీ ఇవ్వకుండా లోపలికి వచ్చాడు శేఖరం.

'ఏలవ్ లేడా ఇంట్లో?'

సుబ్బలక్ష్మి నవ్వుతూ అంది—'లేడు బజార్‌కు వెళ్లాడు. ఇక అమ్మ—శంకర్ మఠానికి వెళ్లింది. ఏకచ్ఛత్రాధిపత్యం.'

వంటఇంట్లోకి రాగానే కూర్చోమంటూ పీటవేసింది, ఒక ప్లేటుతో వేడిగా నేతి పకోడీలు అందించింది. మెల్లిగ ఆరగించ నారంభించాడు శేఖరం. గదిలోకివెళ్లి రెండు పదిరూపాయలు తీసుకొచ్చింది సుబ్బలక్ష్మి అందుకొన్నాడు.

'ఏమిటి విశేషాలు?'

'ఏమున్నాయి, నువ్వేచెప్పాలి — నా యింటికి ఏరోజువస్తావో?'

'ఆ ధ్యానతప్ప ఇంకేమీలేదా ఏం నీకు?' — కొంచెం సిగ్గుతో, కొంచెం ఆనందంతో అంది సుబ్బలక్ష్మి.

'ఊహూ, ఉండలేక పోతున్నాను.'

'ఉండలేకపోతే ఒక పనిచేద్దాం — ఇంకాస్సేపు ఆగితే మానాన్న వస్తాడు, గప్‌చిప్‌గ వెళ్లి దణ్ణం పెట్టేస్దాం. వేసే అక్షింతలు వేసే తీరతాడు—'

నవ్వుకొన్నాడు శేఖరం. ఈ క్షణంలో ఇలా అనగలిగిందిగానీ, అదేపనిని చేతలలోకి మార్చమంటే చాలు...

తలుపు తట్టిన చప్పుడయింది — మామయ్య!

వెళ్లి తలుపు తీసింది సుబ్బలక్ష్మి. తిన్నగ వంట ఇంట్లోకి వచ్చాడు శేఖరం మామయ్య.

'ఏరా, ఇలా దయచేశావ్?'

'దయచేద్దామనుకుంటుంటేనే, నువ్వొచ్చావ్—' శేఖరం వ్యంగ్యంగ అన్నాడు.

సుబ్బలక్ష్మి శేఖరంకేసి తీవ్రంగా చూసింది.

'పెద్దవాడివయ్యావన్నమాట!'

'ఆ, గమనించాలేగానీ, చాల తేడా ఉంటుంది—'

'ఏమిటి విశేషం?'

అతుకు బొతుకూ లేకుండా జరిగే సంభాషణ ఎవరికీ మనస్కరించడం లేదు.

ముఖ్యంగా సుబ్బలక్ష్మికి!

సంభాషణను మళ్ళించాలనే ప్రయత్నంతో అంది సుబ్బలక్ష్మి—'కాఫీ తాగుతావా నాన్నా?'

'వద్దమ్మా, పర్సు మర్చిపోయాను, అందుకే వచ్చాను—' అని పర్సు తీసుకొని వెళ్ళిపోయాడు.

తండ్రికి సాగనంపి తిరిగి రాగానే సుబ్బలక్ష్మిని చూసి అన్నాడు శేఖరం—'ఇక నేనూ వెడతాను—'

'కాసేపు కూర్చోబావా!'

'వద్దులెద్దూ, రేపొద్దున్న కనిపిస్తానే మళ్ళీ, అసలిందుకే రానన్నది నేను...'

సుబ్బలక్ష్మికి అర్థమయింది 'ఎందుకు బావా, అనవసరంగ మాటజారిపోవటం?'

'అయితే తప్పు నాదనే నీ ఊహా?'

'పోనీలెద్దూ, ఎందుకు గొడవ చెప్పు?—నాన్న అడిగినపుడు సరిగా సమాధానం చెప్పి ఉంటే సరిపోయేది—'

'లక్ష్మీ, నిజం చెప్పు — తప్పు నాదా?'

సుబ్బలక్ష్మి మౌనంగా ఊరుకొంది.

'మాట్లాడవేం? — మాట జారవద్దని నువ్వే అని, మాటజారి, మళ్ళీ మౌనంగా ఉంటే, ఏం సమంజసం? — మా నాన్న పోవటానికి కారణం మీ నాన్న కాదూ?'

సుబ్బలక్ష్మి బాధతో అంది: 'బావా! ఏమిటిది బావా!'

'ఏమిటా? నిజం. కొంచెం ఘాటుగానే ఉంటుంది. ఆవేళ ఆ వెధవ డబ్బు, మనిషికన్న అధికమయింది. మళ్ళీ నోరెత్తి యాచించాను ... మనుషులు దూరంగా ఉంటే కానీ విలువ తెలీదు లక్ష్మీ—నిజం అది—'

శేఖరం క్షణం ఆగి మళ్ళీ అన్నాడు: ఖచ్చితంగ అడుగుతున్నాను — మీ నాన్న ఆనాడు ఏమాత్రం కనికరించి ఉన్నా, అసలు మీ నాన్న మానవుడే అయి ఉంటే, మా నాన్న అంత దిక్కుమాలిన చావు చచ్చిపోయేవాడు కాదు. మనిషి పుట్టగానే సరిపోదు, మంచి, మమతా కూడ కొంత ఉండి తీరాలి...'

సుబ్బలక్ష్మి మౌనంగా వింటోంది—గతమేం అంత మర్చిపోదగ్గది కాదు. ఆ గతం ఇంకా గతం కాలేదు. బహుశా కాదు. ఈ గతానికెంతో భవిష్యత్తు ఉంది. సుబ్బలక్ష్మికి అంతా ఒకసారి గుర్తుకొచ్చింది.

* * *

విశ్వేశ్వరం, ఆదిలక్ష్మి అన్నాచెల్లెళ్ళు. అన్నాచెల్లెళ్ళన్న పేరేగానీ, వాళ్ళిద్దరి మధ్యా ఆ విధమైన అనుబంధం ఏదీ ఉండేదికాదు. ఎవరికెవరూ పట్టనట్టు, ఏవో ఉత్తర దక్షిణ ధృవాలలాగ కాలం గడిపేవారు. వాళ్ళు ఏకోదరులేకానీ, ఆగర్భ శత్రువులుగ ప్రవర్తించేవారు. ఒకరంటే ఒకరికి పడదు. కాలం ఖర్మకలిసి వస్తే, ఒకటవకపోతారా అనే అనుకునేవారు వాళ్ళ అమ్మా, నాన్నాలు.

కానీ అదేం ఖర్మమోగానీ, ఆ కాలం ఖర్మమాత్రం కలిసిరాలేదు, ఆ అన్నాచెల్లెళ్ళకు.

ఆదిలక్ష్మికి పెళ్ళవటం, శేఖరం పుట్టటంకూడ జరిగాయి. శేఖరం పుట్టిన కొన్ని సంవత్సరాలకే శేఖరం తండ్రి వ్యాపారంలో బాగా నష్టపోయాడు. కోలుకోనంతగ నష్టం అవటంతో మానసికంగ గాయపడినా కూడ, చెల్లెలును, చెల్లెలి భర్తను కనీసం పలకరించి వెళ్ళాలనే ధ్యాసలేకపోయింది విశ్వేశ్వరానికి.

తనమీద అన్న కెందుకంత కక్షో అర్థంగాక నానాబాధపడేది ఆమె. చివరికి, ఇల్లు గడవని పరిస్థితులు ప్రాప్తం రావటం సంభవించాయి. ఆత్మాభిమానం చంపుకోలేకపోయినా, చంపుకుని మరీ వెళ్ళింది విశ్వేశ్వరం వద్దకు.

అభిమానం లేదనిపించినా, ఆ రక్త సంబంధమే బహుశా అతనిచేత ఆమెకు ధనసహాయం చేయించింది. అలాగే మూడు నాలుగుసార్లు జరిగింది.

కానీ—

చేసిన సహాయం చేసినట్లే ఉన్నా ఒకసారి గనుక చేయకపోతే, అంతకుముందు చేసిన సాయం అంతా గంగలోకలిసిపోతుంది. అచ్చం ఇదే జరిగింది విశ్వేశ్వరం విషయంలో.

ఆవేళకూడ ఆదిలక్ష్మి వచ్చి అన్నయ్యను డబ్బు అడిగింది. విశ్వేశ్వరం అటూ ఇటుగ లేదనే చెప్పాడు. అవమానంతో కృంగిపోయి, ఇంటికి తిరిగి వచ్చింది ఆదిలక్ష్మి.

* * *

శేఖరానికిది తెలియనికాదు—అయినా, తన తండ్రి చావుకు కారణం కేవలం మామయ్యే అనేది దృఢంగ నాటుకుంది మనసులో.

కానీ—శేఖరానికి సుబ్బలక్ష్మి అంటే ప్రేమ, అభిమానం బోలెడు. పెళ్ళి చేసుకోవాలనే ఊహ. ఆదిలక్ష్మికిది తెలుసు—అయినా అదంతగ అభ్యంతరపెట్టతగిందిగ కనబడలేదామెకు. వద్దంటే విశ్వేశ్వరమే వద్దనాలి—అందుకే పిల్లా ముద్దుగ విశ్వేశ్వరాన్ని 'విలన్' అంటారు.


స్థూలంగ అదీ జరిగింది—

'ఏయ్, పిల్లా వింటున్నావా?' శేఖరం హాస్యంగ అడిగాడు.

సుబ్బలక్ష్మి ఉలికిపడింది. శేఖరం మాటలు వినడం మానేసి చాలాసేపయింది. నవ్వుతూ అంది—'ఊహూ, లేదు.'

'ఎందుకు వింటావులే, మీ నాన్నను పొగిడితే వినేదానవు. కానీ నేనూ...'

'ఊరుకో బావా, మరేం. జరిగిందానికి ఇప్పుడనుకొని మాత్రం లాభం ఏమిటి?'



శేఖరం ఒకక్షణం ఆగి అన్నాడు—

'జరిగిందీ ఆలోచించక ఏమీ చెయ్యలేము. మా నాన్న పోవడం మాకెంత నష్టమో నీకు తెలుసుగా—దీనికి మీ నాన్నే కారణం అంటాను నేను—'

'కాదేమోనని నేనంటాను మరి—' సుబ్బలక్ష్మి కంఠంలో కొత్తదనం ఏదో కనిపించింది. అందుకే తల ఎత్తి చూశాడు.

'అవును బావా, నువ్వు చెప్పు. ఆనాడు ఏదో చేశాడు, దానికి కారణం నువ్వన్నట్టు మా నాన్న కాకపోయినా—కొంత బాధ్యత వుంది మా నాన్నకు. అది మా నాన్నకు తెలీక కాదు...నీకు తెలీదు గానీ, జరిగిన దానికి నాన్న ఎంత బాధ పడుతున్నాడో నీకేం తెలుసు?'

'మీ నాన్న బాధ పడటమా? నేను నమ్మను.'

సుబ్బలక్ష్మి నవ్వింది—'నువ్వు నిత్య శంకితుడివి బావా!—నేను ఎన్నిసార్లు చెప్పాను, నిన్ను చేసుకు తీరతాను అని. అయినా అనుమానమే నీకు. ప్రతి పది హేను రోజుల కొకసారి వచ్చి క్లారిఫికేషన్ పొందితే నీ తృప్తి లేదంటావ్.'

'అవుననుకో, అయినా...'

'ఇంకేమి అనకు బావా! నా మీద నమ్మకం వుంచు. మా నాన్న చాల బాధ పడుతూనే వున్నాడు. నీకు తెలీదు.'

శేఖరం అసంతృప్తిగా తల ఊపాడు.

'పోనీ, ఇది నమ్ము—నేను నీ కిచ్చే డబ్బెవరిదంటావ్?'

'ఆఫ్‌కోర్స్...'

'కానా? నేను నెల నెలా యూఫ్ట్ తీసుకొని, పాతిక నీకిస్తున్నానా? అది మా నాన్న ఊహించి వుండడ నా—నీ ఊహ?'

'నే నాలోచించలేదు.'

'నేను ఆలోచించాను. నాన్నకు నువ్వంటే చాలా సానుభూతి ఉంది. నిన్న నాన్న మనల్ని హోటల్లో చూశాట్ట—తెలుసా?'

శేఖరం గతుక్కుమన్నాడు.

'వెయిటర్‌ను పిలిచి, బిల్లెవరిస్తారని అడిగాట్ట. హోదున్నే నాన్నే అన్నాడు నాతో—'శేఖరం ఎప్పుడయినా డబ్బడిగితే లేదనకు' అని, తెలిపిందా?'

## సుబ్బలక్ష్మి...

శేఖరం తేరుకుంటూ అన్నాడు—'కారణం అడిగావేమో—'

'నీకు అన్నీ అనుమానాలే—' సుబ్బలక్ష్మి నవ్వింది.

'అవును—ఎం. ఎస్‌సి అయిపోతోంది గదూ, నీకికే ఇచ్చేస్తే సరి, కట్నం బాధ ఉండదనే—'

'అనుమానం బాగనే ఉంది. నాకో అనుమానం మరి...'

శేఖరం తలెత్తాడు ఏమిటన్నట్టు.

'ఏమీలేదు కానీ, నాకన్న, కట్నంమీదే ఆశ ఉన్నట్టుందే నీకు—' నవ్వింది సుబ్బలక్ష్మి.

'ఈ విషయంలో అనుమానంలేదు నాకు. —నాకు నువ్వే ఎక్కువ ఎంత ఎక్కువ అంటే ప్రాణానికన్నా...'

సుబ్బలక్ష్మి సంతోషంతో నవ్వుకొంది.

* * *

ఇదంతా జరిగిన వారంరోజులకు సుబ్బలక్ష్మికి ఉత్తరం వచ్చింది. ఆశ్చర్యపోతూ చదువుకొంది—

'నా ప్రాణానికి—

నీకిది ఎలా చెప్పాలో తెలీక సతమతమయి, చివరకు ఈ మార్గం అవలంబించాను—ఎందుకు సతమతమయ్యానంటే—నువ్వు నన్ను అనుమానంగాడినని, దుఃఖభాగుడనని అంటావు గనుక!

పోనీ—నువ్వు హేళన చేసినా సరే, నిజం చెప్పు — మీ నాన్నకు నేనంటే సానుభూతి తప్ప ఇంకేంలేదా?

ఎదుటి వాడి నుంచి, ముఖ్యంగ మామయ్యతోటి ఆత్మీయుని నుండి నేనాశించేది సానుభూతి మాత్రం గాదు, ప్రేమ! నాక్కావాల్సింది సానుభూతిగదు, నాకు అనుమానం లేదీ విషయంలో.

పోతే—నువ్వు నా ప్రాణానివని ముందే అన్నాను. కానీ—ఒక అనుమానం.

నువు నన్ను పెళ్ళి చేసుకుంటావు—అనుమానంలేదు.

ఇంతకీ, నీకూ నేనంటే సానుభూతి తప్ప మరేంలేదా?—సానుభూతి నాకక్కర్లేదు.

నీకు నేనంటే సానుభూతి ఉంటే, దాన్ని చంపుకో!

మనిషి మనిషినుండి ఆశించేది ప్రేమ అంతే!

ప్రేమ కలకాలం ఉండేది. సానుభూతి కరిగిపోయేది.

నువ్వు నన్ను ప్రేమిస్తూనే ఉంటే—రేపు, బుధవారంనాడు, నువ్వు నన్ను వై. ఎం. సి. ఏ. లో నీ అంతట నువ్వే పలుకరించు. లేకపోతే సరి—నువ్విస్తోన్న డబ్బును సాధ్యమైనంత త్వరలో తీరుస్తా. మాట ఇస్తూ ఇది నేను నీకు రాస్తున్న 'ప్రేమసరి' నోటు.

శేఖరం—'

సుబ్బలక్ష్మి ఆ ఉత్తరాన్ని పదిలంగ దాచుకుంది.

* * *

బుధవారంనాడు—వై. ఎం. సి. ఏ. బస్‌స్టాప్‌లో—

సుబ్బలక్ష్మి శేఖరంకేసి నడుస్తోంది—అదిగో పలుకరించింది.

అతనూ పలికాడు.

ఇక వాళ్ళను పలుకరించడం నాకు తగినపని.

ఏదైనా పాత్రలో వంట ప్రారంభించేటప్పుడు దానిలోపల కొంచెం నూనె మెరుగు రాస్తే — తరువాత తోముకోవడం సులభం. వండే వంట గిన్నెకి అంటుకు పోదు. ఏ నీళ్ళతోనో యిట్టే శుభ్రంగా తోమేయవచ్చు. అలా కాకుంటే—అడుగంటిన వంట కాలని ఏ అట్టుకాడో, యిటికముక్కో పెట్టి రాసి తోమాలి. కష్టానికి కష్టం, గిన్నెలూ గీతలు పడిపోతాయి.

* * *

ఉద్యోగిని అయిన యిల్లాలికి రోజుల్లో పని సులభం గావాలంటే ప్రెషర్ కుక్కర్ కావాలి. గంటా గంటన్నర పట్టే వంట అరగంటలో అయిపోతుంది. అన్నీ రెండుపూటలకీ కలిపి వండేసుకుని ఇబ్బంది పడక్కర లేకుండా సాయంత్రం ఆఫీసునుంచి వచ్చాక విశ్రాంతిగా త్వరగా కుక్కర్ మీద వండేసుకోవచ్చు. శ్రమ పడక్కరలేకుండా వేడి భోజనంకంటె ఏం కావాలి?